సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 27 । ఏప్రిల్ । 2024



పరిమళించిన 'కస్తూరి'

పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల బాలికలు మెరిశారు. చాలామంది 500 పైన మార్కులు సాధించారు. -8లో



వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో వైఎస్సార్ సీపీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయి. శుక్రవారం పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేరారు. - 8లో

గరిష్టం/కనిష్టం
43.2/27.0

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 27.0 – 43.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

బధిరుల పాఠశాలలో ప్రవేశాలు

కడప ఎడ్యుకేషన్: హెలెన్ కెల్లర్స్ బధిరుల ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో 1వ తరగతి నుంచి ఇంటర్ వరకు రాయలసీమ ప్రాంతంలోని చెవిటి, మూగ బాలబాలికలకు ప్రవేశాలు కల్పిస్తున్నట్లు హెలన్ కెల్లర్స్ విద్యా సంస్థల జనరల్ సెక్రటరీ, కరస్పాండెంట్ పి. దౌలత్‌ఖాన్ తెలిపారు. వీరికి ఉచిత విద్యతో పాటు హాస్టల్ వసతి, స్పీచ్ థెరపీ, ఆడిటరి ట్రెనింగ్, కంప్యూటర్, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. వివరాలకు 9849311680, 9966006758 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నేత్రదానం



కార్నియాలను సేకరిస్తున్న రాజు

పులివెందుల రూరల్: మండల పరిధిలోని ఎర్రిపల్లి గ్రామానికి చెందిన లింగాల వీరారెడ్డి (75) శుక్రవారం మరణించడంతో ఆయన భార్య బాలనారాయణమ్మ, కుమారులు మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తంరెడ్డి, రాజగోపాల్‌రెడ్డిలు నేత్ర దానానికి అంగీకరించారు. ఈమేరకు స్నేహిత అమృత హస్తం సేవాసమితి నేత్రసేకరణ కేంద్రం అధ్యక్షుడు రాజుకు సమాచారం అందించారు. ఆయన టెక్నీషియన్ హరీష్‌తో కలిసి మృతుని గ్రామానికి వెళ్లి కార్నియాలను సేకరించి హైదరాబాద్‌లోని డాక్టర్ అగర్వాల్ నేత్రనిధికి పంపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మనిషి మరణానంతరం మట్టిలో కలిసిపోయే నేత్రాలు దానం చేస్తే అంధత్వంతో ఈ లోకాన్ని చూడలేకపోతున్న వారికి చూపునిచ్చినవారవుతారన్నారు. నేత్రదానానికి సంబంధించి 9966509364, 7093204537 నంబర్లకు సమాచారం అందించాలని కోరారు.

కాంగ్రెస్ ఉపాధ్యక్ష పదవికి రాజీనామా

కడప వైఎస్ఆర్ సర్కిల్: అన్నమయ్య జిల్లా రాజంపేట లోక్‌సభ స్థానం నుంచి తనకు టికెట్ ప్రకటించి మొండిచేయి చూపడంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు నజీర్ అహ్మద్ తెలిపారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం తర్వాత పార్టీ కార్యకర్తలకు మేలు జరుగుతుందని భావించామన్నారు. సంవత్సరాల తరబడి పార్టీకి సేవ చేసిన వారిని విస్మరించి పార్టీకి సంబంధం లేని వారికి ఈ ఎన్నికల్లో టికెట్లు ఇవ్వడం సరికాదన్నారు. రాజంపేట లోక్‌సభ స్థానానికి తన పేరు ప్రకటించిన షర్మిల చివరి నిమిషంలో హైదరాబాద్ వాసి బషీద్‌కు బీఫారం ఇచ్చారన్నారు. షర్మిల వైఖరికి నిరసనగా తాను రాజీనామా చేసినట్లు ఆయన తెలిపారు.

స్వీయ జాగ్రత్తలతో వడదెబ్బను అధిగమిద్దాం

కడప సెవెన్‌రోడ్స్: ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు ఆరోగ్య సూత్రాలు, స్వీయ జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ వి.విజయ రామరాజు ఒక ప్రకటనలో సూచించారు. జిల్లాలో కొద్ది రోజులుగా ఎండలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయని, ఎండ తీవ్రత, వడ గాడ్పులకు ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలలో రోజువారీ ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీలుగా నమోదు అవుతున్నాయన్నారు. అధిక ఉష్ణోగ్రతలు ఇదేవిధంగా మరికొద్ది రోజులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోందన్నారు. జిల్లా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

629 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 632 ఫిర్యాదులు అందగా 629 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు శుక్రవారం తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు ఫిర్యాదు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేశారు.

- సీ-విజిల్ ద్వారా మొత్తం 400 కేసులు నమోదు కాగా అందులో 248 నిజనిర్ధారణ కాగా, 151 నిరాధారమైనవిగా గుర్తించామన్నారు.
- ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి, పోలీసు ఎన్ఫోర్స్ మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,79,57,685 ల మేర నగదు, రూ.7,65,71,042 ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేశారు. అలాగే 1,117 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేశారు.

ప్రాజెక్టులకు ప్రాణం

- శరవేగంగా సాగుతున్న పనులు
- జీఎన్ఎస్ఎస్, తెలుగుగంగ ప్రాజెక్టులకు రూ. 3500 కోట్ల వ్యయం
- ఆయకట్టు పెంపునకు ప్రత్యేక కృషి



కడప సిటీ: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలో ఉన్న ఆయా ప్రాజెక్టుల పెండింగ్ పనులను శరవేగంగా పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. జీఎస్ఎస్ఎస్, తెలుగుగంగ, ఇంకా ఆయా ప్రాంతాల్లో ఉన్న ప్రాజెక్టుల పెండింగ్ పనులకు రూ. 3500 కోట్లు కేటాయించింది. ఆయకట్టు పెంపునకు కృషి చేస్తోంది. ఇదే కాకుండా కరువు నివారణ పథకం కింద ఆయా ఎత్తిపోతల పథకాలు కూడా చేపట్టింది.

జీఎన్ఎస్ఎస్ కింద..

గాలేరు–నగరి సుజల స్రవంతి (జీఎన్ఎస్ఎస్) పథకం కింద 1, 2, 3 ప్యాకేజీ పనులకు సంబంధించి పనులు జరుగుతున్నాయి. ఇందుకోసం 2020–23లో రూ. 1345 కోట్లకు టెండర్లు పిలిచి పనులు చేపట్టారు. ఇందులో మొదటి ప్యాకేజీకి రూ. 310 కోట్లు అంచనా వ్యయం కాగా రూ. 210 కోట్లు, రెండో ప్యాకేజీకి రూ. 510 కోట్లు కాగా రూ. 470 కోట్లు, మూడో ప్యాకేజీకి సంబంధింధించి రూ. 520 కోట్లు కాగా రూ. 160 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 1345 కోట్ల అంచనా వ్యయానికి ఇప్పటివరకు రూ. 840 కోట్ల విలువైన పనులను ప్రభుత్వం పూర్తి చేసింది. 0 నుంచి 75 కిలోమీటర్ల వరకు కెనాల్ పనులు పూర్తయ్యాయి. మిగతా డిస్ట్రిబ్యూటరీ పనులు కొనసాగుతున్నాయి. సర్వరాయసాగర్, వామికొండ ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ పనులకు రూ. 212 కోట్లతో టెండర్లు పిలిచారు. 35 వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లిచ్చేందుకు చర్యలు చేపట్టారు. టీడీపీ హయాంలో అరకొర నిధులు మాత్రమే కేటాయించారు. అంతేకాకుండా సర్వరాయసాగర్ ప్రాజెక్టు 0.5 టీఎంసీలు నీటిని మాత్రమే టీడీపీ ఉంచగా, ఈ ప్రభుత్వం 1.65 టీఎంసీల నీటితో నింపింది.

గండికోట నిర్వాసితులకు రూ. 580 కోట్లు

ప్రభుత్వం గండికోట నిర్వాసితులకు రూ. 580 కోట్లు చెల్లించడంతో గండికోట ప్రాజెక్టును పూర్తి సామర్థ్యంతో నింపేందుకు అవకాశం ఏర్పడింది. గత టీడీపీ ప్రభుత్వం నిర్వాసితులకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేసింది. టీడీపీ హయాంలో కేవలం 12 టీఎంసీలు మాత్రమే గండికోటలో నిల్వ ఉంచగా, ఈ ప్రభుత్వ హయాంలో 26.85 టీఎంసీల పూర్తి నీటి సామర్థ్యంతో నింపగలిగింది. పెండింగ్ పనులను పూర్తి చేయడంతో పూర్తి సామర్థ్యానికి అడుగులు పడ్డాయి. జీకేఎల్ఐ కింద 47,500 ఎకరాలకు ఆయకట్టును పెంచి 30 వేల ఎకరాలకు సాగునీరు అందించడం కూడా ఈ ప్రభుత్వ హయాంలో జరిగిందే. జీకేఎల్ఐ నుంచి కేవలం ఆరు వేల ఎకరాలకు మాత్రమే టీడీపీ హయాంలో సాగునీరు అందిన పరిస్థితి ఉంది.

జీఎన్ఎస్ఎస్ పనులకు రూ.4300 కోట్లు

జీఎన్ఎస్ఎస్ పనులకు రూ. 4300 కోట్ల నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటికే రూ. 1250 కోట్ల పనులను చేపట్టింది. వైఎస్సార్ జిల్లాకు రూ. 650 కోట్లు, అన్నమయ్య జిల్లాకు రూ. 750 కోట్లు ఖర్చు చేయాలన్నది ప్రధాన ఉద్దేశం. పనులు పూర్తయితే వైఎస్సార్ జిల్లాలో 40 వేల ఎకరాలకు, అన్నమయ్య జిల్లాలో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల మందికి తాగునీరు అందనుంది. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో 90 చెరువులు నింపేందుకు అవకాశం ఉంది. ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. 4, 5, 6, 7 ప్యాకేజీలకు సంబంధించి కడప నుంచి రైల్వేకోడూరు వరకు పనులు చేస్తున్నారు. భూసేకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. అటవీశాఖకు సంబంధించిన అనుమతులు త్వరలో అందనున్నాయని అధికారులు చెబుతున్నారు.

- తెలుగుగంగ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. టీడీపీ హయాంలో తెలుగుగంగ ప్రాజెక్టులో కేవలం 12 టీ ఎంసీల నీటిని మాత్రమే నింపేందుకు అవకాశం ఉండగా, ఈ ప్రభుత్వ హయాంలో పూర్తి సామర్థ్యంతో నింపేందుకు చర్యలు తీసుకుంది. డయా ఫ్రంవాల్ లీకేజీని అరికట్టకుండా టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వం వచ్చాక డయా ఫ్రం లీకేజీని అరికట్టి 17 టీఎంసీల నీటిని నింపింది. 80 వేల ఎకరాల ఆయకట్టును పెంచింది.

ఎల్ఎస్‌పీకి కొత్తగేట్ల నిర్మాణం

లోయర్ సగిలేరు ప్రాజెక్టు(ఎల్ఎస్‌పీ)కు సంబంధించి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం వల్ల ఒక గేటు ఊడిపోయి నీళ్లు వృథాగా సోమశిలకు వెళ్లాయి. ప్రస్తుత ప్రభుత్వం దాదాపు రూ. 82 కోట్లు ఖర్చు చేసి కొత్త గేట్లతోపాటు కాలువల వెడల్పు నిర్మాణ పనులను, డిస్ట్రిబ్యూటరీ పనులను చేపట్టింది. దీంతో 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించేందుకు అవకాశం ఏర్పడింది. అంతేకాకుండా కాశినాయన, కలసపాడు మండలాల్లో లిఫ్ట్ పనులు కొనసాగుతున్నాయి.

ప్రాజెక్టు పనులను విస్మరించిన టీడీపీ

ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రాజెక్టు పనులను గత టీడీపీ ప్రభుత్వం విస్మరించడంతోనే అభివృద్ధి కుంటుపడింది. అరకొర కేటాయింపులు, నిర్లక్ష్య వైఖరి ఇందుకు కారణం. ప్రస్తుత ప్రభుత్వం ప్రాజెక్టుల పెండింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద టీడీపీ హయాంలో ఐదు వేల ఎకరాల ఆయకట్టుకు నీళ్లివ్వగా, ఈ ప్రభుత్వం 28 వేల ఎకరాలకు నీళ్లిచ్చింది. 59,400 ఎకరాల ఆయకట్టు పెరిగింది. అలాగే పీబీసీ కింద టీడీపీ హయాంలో 15 వేల ఎకరాలు కాగా, వైఎస్సార్ సీపీ హయాంలో 40 వేల ఎకరాలు, మైలవరం ప్రాజెక్టుకు సంబంధించి టీడీపీ హయాంలో 20 వేల ఎకరాలు, వైఎస్సార్ సీపీ హయాంలో 50 వేల ఎకరాలకు నీళ్లివ్వడమే కాకుండా 6.5 టీఎంసీలతో నింపింది. అలాగే జీకేఎల్ఐ, లింగాల కుడి కాలువ కింద 47,500 ఎకరాల ఆయకట్టు కాగా, 30 వేల ఎకరాలకు నీళ్లిచ్చింది. టీడీపీ హయాంలో 6000 ఎకరాలకు మాత్రమే సాధ్యమైంది. ఝరికోన, వెలిగల్లు ఎత్తిపోతల పథకాలకు కూడా ఈ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పింఛా ప్రాజెక్టుకు సంబంధించి రూ. 60 కోట్లతో పనులు చేపడుతున్నారు. బండ్ వాల్, స్పిల్‌వే పనులు, గేట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. జులై నాటికి పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. అన్నమయ్య ప్రాజెక్టుకు సంబంధించి రూ. 550 కోట్లతో పనులు చేపట్టేందుకు టెండర్లు పూర్తి కాగా, త్వరలో పనులు జరగనున్నాయి.

కాలేటి వాగుకు రూ.250 కోట్లు

జీఎన్ఎస్ఎస్ నుంచి ఎత్తిపోతల ద్వారా కాలేటి వాగుకు నీటిని తరలించే కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ. 250 కోట్లు కేటాయించింది. 90 శాతం పనులు పూర్తయ్యాయి. 0.2 టీఎంసీల నుంచి 1.2 టీఎంసీలు పెంచాలని నిర్ణయించారు. ఈ పనులు పూర్తయితే 39 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందడమే కాకుండా లక్ష మందికి తాగునీరు అందేందుకు అవకాశం ఏర్పడుతుంది. చక్రాయపేట, రామాపురం, లక్కిరెడ్డిపల్లె మండలాల పరిధిలోని 133 చెరువులకు నీళ్లు నింపేందుకు అవకాశం ఉంటుంది. ఈ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి.

నేడు పాలిసెట్ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- జిల్లా వ్యాప్తంగా 16 కేంద్రాల్లో పరీక్ష నిర్వహణ
- కడపలో 09, ప్రొద్దుటూరులో 07 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 7840 మంది విద్యార్థులు
- ఉదయం 11 గంటలకే పరీక్ష ప్రారంభం



కడప పరీక్షా కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కో ఆర్డినేటర్, అధికారులు

కడప ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 27వ తేదీ శనివారం నిర్వహించనున్న పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పాలిసెట్ –2024) ప్రవేశ పరీక్షకు అధికారులు ఏర్పాట్లను సిద్ధం చేశారు. ఈ పరీక్ష కోసం కడపలో 09 పరీక్షా కేంద్రాలను, ప్రొద్దుటూరులో 07 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. కడపలోని 09 పరీక్షా కేంద్రాలలో 3455 మంది విద్యార్థులు, ప్రొద్దుటూరులోని 06 కేంద్రాలలో 4385 మంది విద్యార్థులు కలపి మొత్తం 7840 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించారు. అన్ని పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

గంట ముందు చేరుకోవాలి



పాలిసెట్ ప్రవేశ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి. హాల్‌టికెట్‌తో పాటు బాల్ పాయింట్ పెన్ను(బ్లూ లేదా బ్లాక్), హెచ్‌బీ/2బి పెన్సిల్, రేజర్, షార్ప్‌నర్ అలాగే ఆధార్‌కార్డు తమ వెంట తెచ్చుకోవాలి. ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించం.– సీహెచ్. జ్యోతి, జిల్లా పాలిసెట్ కోఆర్డినేటర్, కడప.

కడపలో 9 పరీక్షా కేంద్రాలలో....

సెంటర్‌పేరు	విద్యార్థులు
గవర్నమెంట్ కాలేజ్ ఫర్ మెన్	480
ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ కాలేజ్ ఫర్ ఉమెన్	480
ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల	300
గవర్నమెంట్ మున్సిపల్ హైస్కూల్ మెయిన్	240
శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల	300
శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల	597
నాగార్జున డిగ్రీ కళాశాల	459
గురుకుల విద్యాపీఠ్ హైస్కూల్	300
శ్రీహరి డిగ్రీ కళాశాల	300
ప్రొద్దుటూరులో ఆరు పరీక్షా కేంద్రాలలో ...	
వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల	750
ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల	600
వైవీఎస్ మున్సిపల్ హైస్కూల్	400
అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్	200
లేపాక్షి డిగ్రీ కళాశాల	240
సాయి రాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	1057
చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ	1148

పువ్వులన్నీ విరిసె..సీతాపతి మురిసె

ఒంటిమిట్ట కోదండ రామాలయంలో నయనానందకరంగా పుష్పయాగం

ఒంటిమిట్ట: ఏకశిలానగరి కోదండ రామయ్య సన్నిధిలో శుక్రవారం పుష్పయాగాన్ని వేడుకగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన తరువాత పుష్పయాగం, ఏకాంతసేవ నిర్వహించడం సంప్రదాయం. ఇందులో భాగంగా వివిధ ప్రాంతాల నుంచి తెప్పించిన నయన మనోహరమైన పుష్పాలతో దాశరథిని అర్చించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఈ వేడుకను తిలకించి పులకించిపోయారు.

ముప్పున్నెల..సిరివెన్నెల

ఏకశిలానగరి కోదండ రాముడి సన్నిధిలో శుక్రవారం పుష్పయాగం కనుల పండువగా సాగింది. ఈ కమనీయ ఘట్టాన్ని కనులారా తిలకించి భక్తులు తన్మయత్వం పొందారు. రంగురంగుల పుష్పాలతో జగదభిరాముడికి పుష్పాభిషేకం చేశారు. ఉదయం సుప్రభాత సేవ జరిగింది. ఆలయశుద్ధి, ఆరాధన చేపట్టారు. అనంతరం భక్తులకు సర్వదర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం 5:30 గంటలకు ఆలయ టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు ఆధ్వర్యంలో పుష్పప్రదర్శన చేశారు. బెంగళూరు, నాగర్‌కోయిల్, శ్రీరంగం, చెన్నై, తిరుపతి, కడప నగరాల నుంచి 1.5 టన్నుల పుష్పాలను తెప్పించారు. గులాబీ, చామంతి, నూరువరహాలు, సంపంగి, మల్లె, గన్నేరు, మొగలిరేకులు, కనకాంబరాలు, తామర పూలు తీసుకువచ్చారు. తులసిదళాలు, దవనం, పన్నీరు, మరవం పత్రాలతో సీతారామలక్ష్మణ మూర్తులకు పుష్ప నీరాజనం చేశారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి భక్తులను కాపాడేందుకు, స్వామివారికి పూజలు చేసి భూ మాతను ప్రసన్నం చేసుకునేందుకు వైష్ణవాలయాలలో పుష్పయాగం సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ యాగం నిర్వహించడంతో సమస్త దోషాలు తొలగిపోతాయని వేదపండితులు రాజేష్ భట్టార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పుష్పయాగంలో జగదభిరాముడు

ముగిసిన నామినేషన్ల పరిశీలన

- కడప పార్లమెంటు స్థానానికి 14 నామినేషన్ల ఆమోదం, 18 తిరస్కరణ
- అసెంబ్లీ స్థానాలకు 141 ఆమోదం,79 తిరస్కరణ

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల్లో మూడో కీలక ఘట్టం ముగిసింది. నామినేషన్ల పరిశీలనను అధికారులు పూర్తి చేశారు. సరైన నమూనాలో లేని నామినేషన్లను తిరస్కరించారు. ఎన్నికల సంఘం అధికారులు కడప పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం కడప కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు నామినేషన్ల పరిశీలన ప్రక్రియను సజావుగా నిర్వహించారు. జిల్లా ఎన్నికల పరిశీలకులు, నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులు, ధ్రువీకరించబడిన ప్రతినిధులు, ఎన్నికల ఏజెంట్ల సమక్షంలో ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి నామినేషన్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. నామినేషన్ల పరిశీలన ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కడప కలెక్టరేట్‌లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. అలాగే అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన నామినేషన్లను ఆయా ప్రాంతాలలోని రిటర్నింగ్ అధికారులు పరిశీలించారు. కడప లోక్‌సభ స్థానానికి 61 నామినేషన్లు, 7 అసెంబ్లీ స్థానాలకు 317 నామినేషన్లు దాఖలు అయ్యాయి. అయితే వీటిలో ఒక్కొక్క వ్యక్తి రెండు నుంచి ఐదు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. అలాంటి వాటిలో ఒక్కొక్కటి చొప్పున లెక్కలోకి తీసుకొని మిగిలిన వాటిని పక్కన పెట్టారు. కడప లోక్‌సభ స్థానానిక సంబంధించి నామినేషన్ల పరిశీలన కార్యక్రమం శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి విజయరామరాజు, జనరల్ అబ్జర్వర్ కునాల్ సిల్కు సమక్షంలో నామినేషన్ల పరిశీలన జరిగింది. వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు. లోక్‌సభకు మొత్తం 32 నామినేషన్లు దాఖలయ్యాయి. పరిశీలనలో వివిధ కారణాల వల్ల 18 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. పోగా 14 నామినేషన్లకు ఆమోదం లభించింది. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి గంగాధర్‌గౌడ్ పాల్గొన్నారు.



కడప లోక్‌సభ నామినేషన్లను పరిశీలిస్తున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి విజయరామరాజు

అసెంబ్లీ నియోజకవర్గాలు..

స్థానం	అభ్యర్థులు	తిరస్కరణ	ఆమోదం
కడప	39	25	14
ప్రొద్దుటూరు	34	13	21
జమ్మలమడుగు	34	10	24
మైదుకూరు	28	5	23
కమలాపురం	24	13	11
పులివెందుల	33	3	30
బద్వేలు	28	10	18

శ్రమించి.. సాధించి

- సివిల్స్ ఫలితాల్లో మెరిసిన నాగభరత్
- కడప కుర్రోడికి 580వ ర్యాంకు
- కలెక్టర్ కావడమే లక్ష్యం

కడప ఎడ్యుకేషన్: కడప నగరం విజయదుర్గా కాలనీకి చెందిన మర్రిపాటి నాగభరత్ తల్లిదండ్రుల కోరిక మేరకు రూ. 15 లక్షల సాఫ్ట్‌వేర్ వేతనాన్ని వదులుకుని కలెక్టర్ కావడమే లక్ష్యంగా సివిల్ సర్వీసెస్‌కు సిద్ధమయ్యాడు. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో 580వ ర్యాంకును సాధించి ఐపీఎస్‌కు ఎంపికయ్యాడు. కానీ తన లక్ష్యం ఇది కాదని రానున్న రోజుల్లో ఐఏఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నాడు.

అమ్మానాన్నలే మార్గదర్శకులు..

మర్రిపాటి నాగరాజు(వ్యవసాయశాఖ ఏడీ), తల్లి దివంగత సునందల కుమారుడు మర్రిపాటి నాగభరత్. 1వ తరగతి నుంచి 9వ తరగతి వరకు కడప నాగార్జున మోడల్ స్కూల్‌లో చదివాడు. తరువాత 10వ తరగతి, ఇంటర్ కడపలోని నారాయణ ఒలంపియాడ్‌లో పూర్తి చేశాడు. తరువాత జేఈఈలో 396వ ర్యాంకు సాధించి కలకత్తా ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజినీరింగ్ ఈసీ పూర్తి చేశాడు. అక్కడే ఎంటెక్ పూర్తి చేసి రూ. 15 లక్షల వేతనంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అయితే తన తల్లిదండ్రుల కోరిక మేరకు లక్షలాది రూపాయల వేతనాన్ని వదిలేసి ఢిల్లీలోని వాజీరావు కోచింగ్ సెంటర్‌లో ఏడాది పాటు ఐఏఎస్‌కు కోచింగ్ తీసుకున్నాడు. తరువాత హైదరాబాదుకు వచ్చి వివేకానంద, బాలలత గైడెన్స్‌తో సివిల్స్‌కు సన్నద్ధమయ్యాడు. 2022లో ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనక్కు వచ్చాడు. ఇంతటితో నిరాశ చెందకుండా వారి మార్గదర్శకత్వంలోనే మళ్లీ ఆన్‌లైన్ కోచింగ్ తీసుకుంటూ ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 580వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకుతో ఐపీఎస్ రావచ్చని అయితే తన లక్ష్యం ఐఏఎస్ అని చెబుతున్నాడు.

నిరాశ చెందకుండా..

తన చిన్నతనంలో తమ తండ్రి కలెక్టర్ అంటే ఏమిటి, ఆయన విధులు ఎలా ఉంటాయి, ఆయన అనుకుంటే పేదలకు ఏం చేయవచ్చు, ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టవచ్చు అనే విషయాలను తనకు తెలిపేవాడు.. తమ తల్లి కోరిక కూడా తాను కలెక్టర్ కావడమే.. తమ తండ్రి స్ఫూర్తి, తల్లి కోరిక మేరకు చిన్నప్పటి నుంచే కలెక్టర్ కావడమే లక్ష్యంగా ముందుకు సాగాను. అయితే ఎంటెక్ తరువాత పలుమార్లు సివిల్స్‌కు సిద్ధమయ్యాను. 2022లో మాత్రం ఇంటర్వ్యూ వరకు వెళ్లి ఆగిపోయాను. అయితే అంతటితో నిరాశ చెందకుండా తల్లిదండ్రుల స్ఫూర్తితో మళ్లీ శ్రమించి ఇటీవల విడుదలైన సివిల్స్‌లో 580వ ర్యాంకు సాధించాను. ఈసారి సివిల్స్‌లో కచ్చితంగా మంచి ర్యాంకు సాధించి ఐఏఎస్ కావడమే తన ముందున్న లక్ష్యం.. అని మర్రిపాటి నాగభరత్ తెలిపారు.

పేదరిక నిర్మూలన లక్ష్యంగా...



తాను ఐఏఎస్‌కు ఎంపికై పేదరిక నిర్మూలనకు కృషి చేయడంతోపాటు విద్య, ఆరోగ్యం, స్కిల్స్ అభివృద్ధిపైన ప్రత్యేక చర్యలు తీసుకుంటాను. తమ తండ్రి వ్యవసాయశాఖలో ఏడీగా పనిచేస్తున్నారు. రైతుల కష్టాల గురించి పలుమార్లు తెలిపేవారు. వారి కష్టాలు తీర్చేందుకు కృషి చేస్తాను.. అని నాగభరత్ తెలిపారు.



తండ్రి మర్రిపాటి నాగరాజు (వ్యవసాయశాఖ ఏడీ)తో నాగభరత్

క్లుప్తంగా

జువాలజీలో డాక్టరేట్


ప్రసాద్‌రెడ్డి

వైవీయూ : కడప నగరంలో పర్యావరణ మిత్ర సమూహం సొసైటీ నిర్వహిస్తూ, ఓబులవారిపల్లె మండలం తల్లంవారిపల్లె జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జీవ శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న మూల ప్రసాద్‌రెడ్డికి శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ఎవాల్యుయేషన్ ఆఫ్ కౌమారిన్ యాస్ ఎ పొటెన్షియల్ యాంటీ కన్వల్సంట్: ఆన్ ఇన్ వైవో అండ్ ఇన్ సిలికో అప్రోచ్ ఆన్ ఏపీలెప్సి' అనే అంశంపై ఎస్వీయూ జువాలజీ ప్రొఫెసర్ కె.ఎల్లమ్మ గారి పర్యవేక్షణలో పరిశోధనా పత్రం సమర్పించినందుకు ఈయనకు డాక్టరేట్ ను ప్రధానం చేసినట్లు ఎస్వీ యూనివర్సిటీ పరీక్షల విభాగం అధిపతి ఈ.దామ్లానాయక్ గారు ఒక ప్రకటనలో తెలియజేశారు.

తెలంగాణ ఇంటర్ ఫలితాల్లో మెరిసిన పాలూరు బాలిక


కె.నిత్య

పెద్దముడియం : మండలంలోని పాలూరు గ్రామానికి చెందిన కొణిదుల నిత్య తెలంగాణ ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో 467 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. ఈ విషయాన్ని ఆమె తండ్రి ప్రసాద్ రెడ్డి తెలిపారు.నిత్య హైదరాబాద్‌లో కూకట్ పల్లిలోని చైతన్య కళాశాలలో ఇంటర్ చదువుతోందని చెప్పారు.

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి


తిరుపాల్‌రెడ్డి మృతదేహం

వేంపల్లె : మండలంలోని రామిరెడ్డిపల్లెలో ఉపాధిహామీ కూలీ గుండెపోటుతో మృతి చెందారు. పని చేస్తుండగా కల్లూరు తిరుపాల్‌రెడ్డి గుండెపోటుకు గురయ్యారు. తోటి కూలీలు అతన్ని హుటాహుటిన పులివెందుల ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు ధృవీకరించారు.

చోరీ కేసు ఛేదించిన పోలీసులు

– పోలీసుల అదుపులో ముగ్గురు బాలురు

కడప అర్బన్ : కడప చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో భాగ్యనగర్ కాలనీ, నల్లరాతిమిద్దె పక్కన వీధిలో ఓ ఇంటిలో ఇటీవల దొంగతనం జరిగింది. ఈ సంఘటనకు పాల్పడిన ముగ్గురు బాలురను పాతబైపాస్ సర్కిల్‌లో చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి, ఎస్ఐలు ఎం. మహమ్మద్ రఫీ, పి.రవికుమార్, తమ సిబ్బందితో కలిసి శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 62.300 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.చోరీ కేసును ఛేదించిన చిన్నచౌక్ సీఐ, ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు సి. శివకుమార్, ఎన్. వేణుగోపాల్, జె. రామసుబ్బారెడ్డి, కానిస్టేబుళ్లు పి.వి. శ్రీనివాసులు, పి.ఖాదర్‌హుసేన్, ఏ. శివప్రసాద్, సి. సుధాకర్‌యాదవ్, కె. నాగరాజు, ఎస్.పి. రంతుబాషలను కడప డీఎస్పీ ఎండీ షరీఫ్ ప్రశంసించారు. రివార్డుల కోసం సిఫారసు చేశారు.

పరిమళించిన కస్తూరి

- 96.64 శాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీలు
- పదిలో మెరిసిన బాలికలు
- 583 మార్కులతో సత్తాచాటిన రూస్మిక


వందశాతం ఉత్తీర్ణత సాధించిన సింహాద్రిపురం కేజీబీవీ

కడప ఎడ్యుకేషన్ : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల (కేజీబీవీ) బాలికలు మెరిశారు. జిల్లావ్యాప్తంగా 17 కేజీబీవీలు ఉన్నాయి. వీటిల్లో 613 మంది పదో తరగతి పరీక్షలు రాశారు. వారిలో 593 మంది పాసై 96.64 శాతం ఉత్తీర్ణతను సాధించారు. వీటితోపాటు 10 కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ప్రతి కేజీబీవీ నుంచి చాలామంది 500 పైన మార్కులు సాధించి ఫలితాల పరంగా భళా అనిపించారు.

తల్లిదండ్రులను కోల్పోయి అనాథలైన, చదవాలనే ఆసక్తి ఉన్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించని ఎంతో మంది నిరుపేద బాలికలు చదువుకోనాలనే ఉద్దేశంతో 2005 సంవత్సరంలో కేజీబీవీలను ఏర్పాటు చేశారు.వీటిల్లో సాధారణ విద్యతోపాటు ఆంగ్లమాధ్యమం, యోగా, క్రీడలతోపాటు వృత్తి విద్యాకోర్సుల ద్వారా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. బాలికలకు చదువుతోపాటు బతుకు దెరువుకు భరోసా ఇస్తున్నాయి. అంతేకాకుండా వీటిల్లో ఇంటర్ విద్యను కూడా ప్రవేశ పెట్టారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించిన కేజీబీవీలు..

జిల్లాలో పది కేజీబీవీలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. ఇందులో అట్లూరు కేజీబీవీ 41 మందికి 41 మంది పాసై వందశాతం ఉత్తీర్ణతను సాధించింది. దువ్వూరు కేజీబీవీలో 38 మందికి 38 మంది , మైదుకూరు కేజీబీవీలో 38 మందికి 38 మంది, పెండ్లిమర్రి కేజీబీవీలో 38 మందికి 38 మంది, పోరుమామిళ్ల కేజీబీవీలో 39 మందికి 39 మంది, సింహాద్రిపురం కేజీబీవీలో 34 మందికి 34 మంది, వల్లూరులో 32 మందికి 32 మంది, వేముల కేజీబీవీలో 39 మందికి 39 మంది, బి కోడూరులో 36 మందికి 36 మంది, చక్రాయపేట కేజీబీవీలో 30 మందికి 30 మంది పాసై వందశాతం ఉత్తీర్ణతను సాధించారు.

90 శాతం పైన ఉత్తీర్ణత సాధించినవి..

జిల్లాలోని కాశినాయన కేజీబీవీ 38 మందికి 37 మంది పాసై 97.30 శాతం ఉత్తీర్ణతను సాధించింది. చాపాడు కేజీబీవీలో 37 మందికి 36 మంది పాసై 97.02 శాతం, జమ్మలమడుగు కేజీబీవీలో 29 మందికి 27 మంది పాసై 93 శాతం, పెద్దముడియం కేజీబీవీలో 36 మందికి 33 మంది పాస్ 91.60 ఉత్తీర్ణతను సాధించాయి,

80 శాతంపైన ఉత్తీర్ణత సాధించినవి .

జిల్లాలోని కలసపాడు కేజీబీవీలో 37 మందికి 33 మంది పాసై 89.10 శాతం , ఖాజీపేట కేజీబీవీలో 33 మందికి 29 మంది పాసై 87.87 శాతం, బిమఠం కేజీబీవీలో 38 మందికి 33 మంది పాసై 86.64 ఉత్తీర్ణతను సాధించాయి

మెరిసిన బాలికలు


రూస్మిక

హన్సిక

వాసవి

సింహాద్రిపురం కేజీబీవీ నుంచి చదిపిరాళ్ల రూస్మిక 583 మార్కులను సాధించి కేజీబీవీలో ప్రథమస్థానంలో నిలిచింది. అలాగే ఖాజీపేట కేజీబీవీకి చెందిన హన్సిక 578 మార్కులు సాధించి ద్వితీయ స్థానం, వేముల కేజీబీవిలో వాసవి 577 మార్కులు సాధించి తృతీయస్థానం సాధించారు. అట్లూరు కేజీబీవీలో లక్ష్మి 560 మార్కులు, చక్రాయపేటలో శాంతామణి 573, దువ్వూరులో సుజన 567, మైదుకూరులో రమ్య 574, పెండ్లిమర్రిలో గురుచందు 564, వల్లూరులో ధరణి 566, వేములలో వాసవి 577, బి.కోడూరులో తేజస్విని 561, కాశినాయనలో మౌనిక 525, చాపాడులో చందన 556, జమ్మలమడుగులో లాహిత్య 575, పెద్దముడియంలో ఉదయశ్రీ 572, కలసపాడులో లక్ష్మి 554, ఖాజీపేటలో హన్సిక 578, బిమఠంలో హర్షిత 514 మార్కులను సాధించి అదరహో అనిపించారు.

నిత్యం పర్యవేక్షణ



జిల్లాలోని ఆర్‌జేడీ, డీఈఓల సూచనలు, సలహాలు పాటిస్తూ కేజీబీవీలను నిత్యం పర్యవేక్షించాం. ప్రతి కేజీబీవీలో స్పెషల్ ఆఫీసర్లతో సమావేశాలను నిర్వహిస్తూ పదవ తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. నిత్యం స్టడీ అవర్స్‌తోపాటు వారాంతపు పరీక్షలను నిర్వహిస్తూ ఎప్పటికప్పుడు మార్కుల పరంగా పర్యవేక్షిస్తు వచ్చాం. తక్కువ మార్కులు వచ్చే వారిపట్ల ఎస్‌ఓలతో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం . దీంతో మంచి ఫలితాలను సాధించాం. – విజయలక్ష్మి, జీసీడీఓ, సమగ్రశిక్ష

సంతృప్తికర ఫలితాలు



కేజీబీవీల ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయి. 96 శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు పది కేజీబీవీల్లో వంద శాతం ఉత్తీర్ణతను సాధించాం. చాలా మంది విద్యార్థినులు 550 మార్కులుపైన సాధించారు. చాలా సంతోషంగా ఉంది. – మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖాధికారి

కడప, కమలాపురంలో స్ట్రాంగ్‌రూంల పరిశీలన


కమలాపురంలోని స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న పోలీసుశాఖ అబ్జర్వర్ ఆర్జిత్ సేన్ ఠాకూర్

కడప అర్బన్/కమలాపురం : సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కడప, కమలాపురంలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పోలీసు అబ్జర్వర్ ఆర్జిత్ సేన్ ఠాకూర్ శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత కమలాపురం అంబేద్కర్ గురుకుల పాఠశాలలోని స్ట్రాంగ్ రూమ్‌ను నియోజక వర్గ పోలీస్ నోడల్ అధికారి, స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ ఎన్. సుధాకర్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం భద్రత ఏర్పాట్లపై స్థానిక అధికారులతో చర్చించారు. తరువాత చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్జీపిసి చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లకు ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్ల గురించి ఆరా తీశారు. ఎలక్షన్ సెల్ ఇన్‌ఛార్జ్, 'దిశ' ఇన్స్‌పెక్టర్ యు. వెంకటకుమార్, కమలాపురం సీఐ రామకృష్ణారెడ్డి, చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్, ఎస్ఐ హృషీకేశవరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పోలీసుశాఖ అబ్జర్వర్ ఆర్జిత్ సేన్ ఠాకూర్ శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. కడప ఒన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, ఎలక్షన్ సెల్ ఇన్‌ఛార్జ్ వెంకటకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


అన్వర్ బాషా (ఫైల్)

కమలాపురం : కమలాపురం మండలం పెద్దచెప్పలికి చెందిన సుంకర అన్వర్ బాషా (37) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ హృషి కేశ్వర్ రెడ్డి తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. అన్వర్ బాషా పెద్దచెప్పలిలో పంక్చర్ షాపు నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రోజూ లాగే శుక్రవారం కూడా షాపు తెరిచాడు. అయితే ఎండ తీవ్రత ఎక్కువ ఉన్న కారణంగా బంకు ముందు నీళ్లు చల్లాడు. అనంతరం బంకుకు ఉన్న కడ్డీని పట్టుకుని బంకు ఎక్కుతుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు.అక్కడ ఉన్న వారు గమనించి అతడిని ఆటోలో చికిత్స నిమిత్తం కమలాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.ప్రొద్దుటూరు జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టమ్ అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య దిల్షాద్, ఏడేళ్ల కుమార్తె, ఐదేళ్ల, 2 నెలల వయస్సు కలిగిన ఇద్దరు కుమారులు ఉన్నారు. అన్వర్ బాషా మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఎమ్మెల్యే పరామర్శ

గత పంచాయతీ ఎన్నికల్లో అన్వర్ బాషా పెద్దచెప్పలి 6వ వార్డుకు వైఎస్సార్ సీపీ తరపున వార్డు మెంబర్‌గా గెలిచాడు. అన్వర్ బాషా మృతి వార్త తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కమలాపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. సంఘటన జరిగిన తీరును కుటుంబ సభ్యులను అడిగితెలుసుకున్నారు. వారిని పరామర్శించారు. మీకు అన్ని విధాలా అండగా ఉంటానని ఎమ్మెల్యే మృతుని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఖైదీల ఉత్తీర్ణత

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలను రాసిన కడప కేంద్ర కారాగారం ఖైదీలు ఉత్తీర్ణత సాధించినట్లు కడప కేంద్ర కారాగారం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జవహర్‌బాబు తెలియజేశారు. 2023–24 సంవత్సరానికి ప్రభుత్వం వారు ఇటీవల నిర్వహించిన ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు కడప కేంద్రకారాగారం నుంచి ఓపెన్ టెన్త్‌లో 49 మంది ఖైదీలు పరీక్షలకు హాజరుకాగా, 45 మంది ఉత్తీర్ణత సాధించారు. అందులో బోయ భజన రంగనాయకులు అనే ఖైదీ 500 మార్కులకు 405 మార్కులు సాధించి ఈ స్టడీ సెంటర్‌లో ప్రథమస్థానంలో నిలిచారు. అలాగే ఓపెన్ ఇంటర్‌లో 17 మంది ఖైదీలు పరీక్షలకు హాజరుకాగా, 16 మంది ఖైదీలు ఉత్తీర్ణత సాధించారు. ఈ పరీక్షల్లో వెలుగు సురేష్ అనే ఖైదీ 500 మార్కులకు 371 మార్కులు సాధించాడు. జైళ్లలో ఖైదీల సంస్కరణలో భాగంగా ప్రతి ఖైదీని సంస్కరించి సమాజంలో మంచి పౌరులుగా మెలిగేందుకు కడప కేంద్రకారాగారం అధికారులు కృషి చేస్తున్నారని తెలియజేశారు.

పుష్పగిరిని సందర్శించిన దేవదాయ శాఖ కమిషనర్


పుష్పగిరిలోని శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శిస్తున్న శ్రీ రామ సత్యనారాయణ

వల్లూరు : ప్రముఖ పుణ్య క్షేత్రమైన పుష్పగిరిని దేవదాయ శాఖ కమిషనర్ శ్రీ రామ సత్యనారాయణ శుక్రవారం జాయింట్ కమిషనర్ ఆజాద్ చంద్ర శేఖర్‌తో కలిసి సందర్శించారు. అర్చకులు, అనువంశిక ధర్మకర్త ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ వైద్యనాథ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ చక్ర సహిత కామాక్షీ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో శిల్ప కళా సౌందర్యం అపూర్వమని కొనియాడారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలను అందచేశారు. మొదట వారు గ్రామంలోని శ్రీ శంకరాచార్య పీఠాన్ని సందర్శిం,చారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమీషనర్ శంకర బాలాజీ, డిప్యూటీ కమీషనర్ గురు ప్రసాద్, ఆలయ ఈవో శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, దేవాదాయ శాఖ సిబ్బంది, పురావస్తు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

చోరీ కేసులో జైలుశిక్ష

చింతకొమ్మదిన్నె : మండలంలోని రోడ్డు కృష్ణాపురం గ్రామంలో జరిగిన మొబైల్ దొంగతనం కేసులో నిందితుడు తుంకూరు సూర్య అనే వ్యక్తికి రెండు సంవత్సరాలు జైలు శిక్షతోపాటు, పదివేల రూపాయలు జరిమానా విధించినట్లు సీకే దిన్నే ఎస్ఐ శంకర్ నాయక్ తెలిపారు. గత సంవత్సరం చోరీ జరగ్గా.. అప్పటి ఎస్.ఐ. బి అరుణ్ రెడ్డి కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం శుక్రవారం ఎక్సైజ్ కోర్టు మెజిస్ట్రేట్ హేమ స్రవంతి జానకిరామ్ తీర్పునిచ్చారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

కడప అర్బన్ : విద్య ఎంతో విలువైందని, క్రమశిక్షణతో అభ్యసించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. శుక్రవారం కడపలోని ప్రభుత్వ బాలుర గృహాన్ని, ప్రభుత్వ పరిశీలన గృహాన్ని జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ సిబ్బందితో కలిసి పరిశీలించారు.పిల్లలకు లభిస్తున్న భోజన, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పిల్లల విద్య, ఆరోగ్య విషయాలపట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఎన్నికల ప్రలోభాలపై సమాచారం ఇవ్వండి

కడప సెవెన్‌రోడ్స్ : ఎన్నికల్లో ప్రజలకు పెద్ద ఎత్తున డబ్బు, మద్యం, ఉచిత బహుమతులు పంపిణీ చేయడం.. లేదా వాటిని ఎక్కడైనా దాచి ఉంచిన సమాచారం తెలిస్తే వెంటనే జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందానికి తెలుపాలని డీఆర్వో గంగాధర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారాన్ని 9154690381 అనే నంబరుకు ఫోన్ చేసి తెలుపాలని, సమాచారం తెలిపిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. గతనెల 16న ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చిందన్నారు. జిల్లాలో అక్రమ మద్యం, నగదు, డ్రగ్స్, ఇతర ఉచిత బహుమతుల పంపిణీని అడ్డుకునేందుకు, ఎన్నికల సమగ్రతను కాపాడేందుకు 22 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 21 స్టాటిక్ సర్వైలెన్స్ టీములను నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేశామన్నారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలు చేపట్టి ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు కొత్తగా జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటు చేశామన్నారు.

పద్మాశాలి విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : చదువులో రాణిస్తున్న పద్మశాలి విద్యార్థులకు ప్రోత్సహిస్తూ ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కడపజిల్లా పద్మశాలీయ సేవా సంఘం అధ్యక్షులు అవ్వారు సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరానికి టెన్త్, ఇంటర్, ఐటీఐ, ఇంజనీరింగ్, నీట్, మెడిసినల్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన వారికి ఈ పురస్కారాలు ప్రదానం చేస్తామన్నారు. టెన్త్‌లో 500 మార్కులపైన, ఇంటర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో 900 మార్కులపైన, ఆర్ట్స్ గ్రూపుల్లో 800 మార్కులపైన, ఐఐటీ, ఎంసెట్, ఇంజనీరింగ్, నీట్, మెడిసిన్‌లో జిల్లా స్థాయిలోనే కాకుండా కడప నగర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన పద్మశాలి విద్యార్థులు ఈ పురస్కారాలకు అర్హులన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితాతోపాటు టీసీ జిరాక్స్ కాపీ, రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫోన్ నంబరు, బయోడేటాతోసహా పూర్తి చేసిన దరఖాస్తులను జూన్ 10వ తేదీలోగా పద్మశాలి భవన్ కల్యాణ మండపం, 38/166–5, చిన్నచౌకు, తిరుపతిరోడ్డు, కడప అనే చిరునామాకు పంపాలన్నారు. ఇతర వివరాలకు 98490 26877 నంబరులో సంప్రదించాలన్నారు.

చంద్రబాబు, రేవంత్ వదిలిన బాణం షర్మిల

కడప కార్పొరేషన్ : ప్రతిపక్షనేత చంద్రబాబు, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి వదిలిన బాణం పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అని నూర్‌బాష్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ ఓ. రసూల్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఓటు అడిగే హక్కు కాంగ్రెస్‌కు, టీడీపీకి లేదన్నారు. రాష్ట్రాన్ని విడదీసి కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలను నాశనం చేసిందని, రెండుకళ్ల సిద్ధాంతం అంటూ చంద్రబాబు దగా చేశాడన్నారు. వైఎస్సార్‌పై కేసులు పెట్టి విగ్రహాలు తొలగించిన వారితో షర్మిల జతకట్టడం సిగ్గుసేటన్నారు. షర్మిల వ్యాఖ్యలతో వైఎస్సార్ ఆత్మ క్షోభిస్తోందన్నారు. దూదేకులోడా, పింజారి అర్ధ ముసలామాన్ అని కించపరిస్తే ఐపీసీ సెక్షన్ 1860 కింద శిక్షర్హులు అని జీవో ఇచ్చిన ఘనత జగనన్నదన్నారు. స్కూల్ పిల్లల టీసీలలో ఉన్న హిందూ దూదేకుల అనికాకుండా ముస్లిం దూదేకుల గా ఒక సర్కులర్ ఇచ్చిన నాయకుడు జగన్ అన్నారు. దూదేకులకు అన్ని విధాలుగా అండ గా ఉన్న నాయకుడు జగనేనని, ఆయనకు ఓటు వేసి గెలిపించుకునే బాధ్యత మన అందరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు పెద్దన్న, మహ్మద్ లు పాల్గొన్నారు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

CHANGE OF NAME

■ I, S. SHAMSHAD(OLD NAME) R/O. D.NO 6/732, JANIBASHAPURAM, RAJAMPET (T), (M), ANNAMAYYA (DT) AP, HEREBY CHANGED MY NAME AS SHAIK SHAMSHAD BEGUM (NEW NAME) W/O SHAIK NAIB [C-2004]

WANTED

■ Wanted qualified teachers in MONFORT SCHOOL (B.Ed is must for Primary & High School) Walk in Interview on 26 & 27 April 2024 9.00am to 1pm, Teachers for : English, Telugu, Hindi, Mathematics, Science, Social, Come along with your Certificates and resume. Cell 7995351591, Email:montfortschool.kadapa@gmail.com

■ కడప, రాజంపేట ఏరియాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥లు డ్యూటీ. 45 సం॥ లోపు వయస్సు ఉండాలి. మగవారు మాత్రమే. సెల్ : 72880 04468.

■ శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ రాజంపేట బ్రాంచ్ నందు పనిచేయుటకు డిగ్రీ పూర్తి చేసిన మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం 17వేలు+ఇన్సెంటివ్స్+TA, DA లు ఇవ్వబడును. ఏదైనా మార్కెటింగ్ రంగం నందు అనుభవం కలిగిన వారికి ప్రాముఖ్యత ఇవ్వబడును. సెల్ నెం.8885060820

■ A1 అంబులెన్స్ సర్వీస్ నందు పనిచేయుటకు డ్రైవర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. రూమ్ + భోజనం ఫ్రీ ప్రొపైటర్ నాగరాజు ✆ 9849145569, 9848752529

■ Wanted Qualified and Experienced Teaching, Non Teaching Faculties and Warden for Reputed School and Junior College in Rayachoty. Attractive Salary for the Right Person. ssvbrct@gmail.com. Cont: 9505505044, 7093473533

■ Required qualified candidate with B.Sc. (Mathematics & Physics) as Caretaker for Intermediate Students in "Amma Nanna Kendram Educational Charitable Society", Rayachoty. Cont: 9866696165

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024/ 9640400073

■ కస్తూరిబ్బ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000. ఫ్రీ రూమ్+భోజనం. Hyd. Ph:7995365999

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారులు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705907418
9705944423
9010223797
9010072409

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

ఎన్నికలు సమీపిస్తున్న వేళ జిల్లాలో వైఎస్సార్‌సీపీలోకి రోజురోజుకు వలసలు పెరుగుతున్నాయి. ఇప్పటికే వివిధ గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పార్టీలో చేరారు. తాజాగా శుక్రవారం పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.


ప్రొద్దుటూరు వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి


కమలాపురం: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి


మైదుకూరు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


ఎర్రగుంట్ల: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రొద్దుటూరులో వంద కుటుంబాలు

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలోని సంజీవనగర్, స్వరాజ్యనగర్, కృపానగర్ ప్రాంతాలకు సంబంధించిన వంద కుటుంబాలు టీడీపీని వీడి శుక్రవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరాయి. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు వేసి వైఎస్సార్సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకు వైఎస్సార్‌సీపీలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. జగనన్న సుపరిపాలనే ఇందుకు కారణమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు గుర్రం లావణ్య ప్రకాష్, రాగుల శాంతి, వైఎస్సార్‌సీపీ నాయకులు కమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

పెన్నానగర్‌లో...

సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పెన్నానగర్‌లో టీడీపీ నాయకుడు సయ్యద్ అలీషేర్ జిలాన్, దస్తగిరి, హుసేన్ గౌస్‌తోపాటు 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి వారికి కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరులో..

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీలోని 22వ వార్డుకు చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 22వ వార్డుకు చెందిన తలారి ప్రవీణ్, టి.సుమంత్, టి.పవన్ కుమార్, దినేష్, రాజవర్ధన్, కరీం, జిలాన్, రాఘవ, మాధవ తదితరులు వార్డు ఇన్‌చార్జి సొద్దల సురేష్, తప్పెట చిన్న పుల్లయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, భరత్ కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

కమలాపురం మండలంలో..

కమలాపురం : మండల పరిధిలోని నసంతపురం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి, రాజు పాళెం సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన శూలం అయ్యవార్ యాదవ్ కు చెందిన 30 కుటుంబాలు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన క్రిష్టయ్య, పుల్లయ్య, రాము, నాగేంద్ర బాబు, ప్రసాద్, శ్రీరాములు, బాలాజీ, వేణుగోపాల్, శివ రాజశేఖర్, మురళి, సురేష్, గుర్రయ్య, సత్యనారాయణ, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు తదితరులకు ఎమ్మెల్యే రవీంద్ర నాథ్ రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో సర్పంచ్ రవి శంకర్, ఎంపీపీ గండి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లె మండలంలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని అలిధన ఓబాయపల్లె పంచాయతీలో శుక్రవారం ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి సమక్షంలో 30కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. రాయపాటి ఉత్తయ్య, బాలయ్యగారి శంకర్, రెడ్డెయ్య, రాజేష్, పాలేరు నాగార్జున, మాదిరెడ్డి భీమారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, శివ లతో పాటు మరో 22కుటుంబాలు వైసీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు వాసుదేవరెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డి, జేసిసి కన్వీనర్ మహేంద్రారెడ్డి, జగన్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండ్లిమర్రి మండలంలో..

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వార్డు మెంబర్ ఓబులేసు, హుస్సేన్‌పీరా, ఆంజనేయులు,వెంకటయ్య, గోపాల్, సుబ్బరాయుడు,మోహన్, మస్తాన్ తదితరులు ఉన్నారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి వీరికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణం వేంపల్లి రోడ్డులోని వడ్డెర కాలనీలోని 30 కుటుంబాల వారు శుక్రవారం జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి సుధీర్‌రెడ్డి సమక్షంలో జెడ్పీటీసీ సభ్యుడు తమ్మిశెట్టి ఆధ్వర్యంలో వైఎస్స్రాసీపీలో చేరారు.వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మధు తదితరులు ఉన్నారు.

ఎర్రగుంట్ల పట్టణంలోని 18వ వార్డులో నివాసం ఉండే టీడీపీ నేత జిలాన్‌బాషతో పాటు పలు మైనార్టీ కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు.వీరిని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. మహమ్మద్ రఫీ, మహబూబ్‌షరీఫ్, కొలిమి బాబా, అబ్దుల్‌బాషా, జిలాన్ , మహమ్మద్ పార్టీలో చేరారు.